RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 351 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం ఆదివారం, 23 జూన్ 2024 పేజీలు : 4 వెల : 2/-




# కేంద్ర బడ్జెట్‌కు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్ పెట్టేందుకు ఏర్పాట్లు

## విద్య, వ్యవసాయ కమిషన్లతోపాటు రైతు భరోసా, రైతు రుణమాఫీ, ధరణి, ఆర్ఓఆర్ చట్టాలపై చర్చలు

హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం వర్షాకాల అసెంబ్లీ సమావేశాలకు సిద్ధమవుతోంది. వివిధ శాఖలతో వరుస సమీక్షలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, మంత్రులు.. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు అధికారులను సమాయత్తం చేస్తున్నారు. అలాగే విద్య, వ్యవసాయ కమిషన్లతోపాటు రైతు భరోసా, రైతు రుణమాఫీ, ధరణి, ఆర్ఓఆర్ చట్టాలు తదితర అంశాలు ఈ సమావేశాల్లో చర్చకు వచ్చే అవకాశం ఉంది. జులై రెండో వారం నుంచి అసెంబ్లీ సెషన్ ప్రారంభించే చాన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో ఇప్పటికే అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు.. రానున్న రోజుల్లో ప్రవేశపెట్టనున్న స్కీమ్స్ అమలుకు నిధుల కేటాయింపు, తదితర అంశాలపై చర్చ జరగనుంది. రూ. 2 లక్షల రైతు రుణమాఫీకి ఎంత ఖర్చవుతుంది? దానికి నిధుల సమీకరణ ఎలా చేయాలి? అనే అంశంపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పుడు అమలవుతున్న రైతుబంధు పథకంతో అనర్హులకు కూడా లబ్ధి చేకూరుతుందని భావిస్తున్న తెలంగాణ సర్కారు దాన్ని ప్రక్షాళన చేసే దిశలో ముందుకెళ్లాలని యోచిస్తోంది. అలాగే, సెక్రటేరియట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు, తెలంగాణ చిహ్నంపై చర్చ జరగనున్నట్టు తెలుస్తోంది.

ఈ వర్షాకాల సమావేశాల్లో పూర్తిస్థాయి బడ్జెట్‌కు ఆమోదముద్ర వేయడంతోపాటు పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

**కేంద్ర బడ్జెట్‌కు అనుగుణంగా రాష్ట్ర పద్దుకు తుదిమెరుగులు :** రాష్ట్రంలో ఆగస్టు నుంచి మార్చి వరకు అవసరమైన నిధుల కేటాయింపు కోసం పూర్తిస్థాయి బడ్జెట్ అమల్లోకి రావాల్సి ఉంది. కేంద్రంలో కొత్తగా కొలువుదీరిన ఎన్డీయే సర్కార్ జులైలో పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి, రెండోవారంలో లేదంటే మూడోవారంలో పూర్తిస్థాయి పద్దును ప్రవేశ పెట్టనున్నట్టు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు ఏ మేరకు ఉంటాయో చూసుకుని, వాటి ఆధారంగా ఇక్కడ తెలంగాణ సర్కారు పూర్తిస్థాయి పద్దుకు తుది మెరుగులు దిద్దనుంది. పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్ పెట్టిన రెండు, మూడురోజుల్లోనే రాష్ట్రంలోనూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అంతకంటే ముందు అనేక అంశాలపై అసెంబ్లీలో చర్చ చేయనున్నారు. ధరణి పోర్టల్‌కు బదులుగా భూమాతను తెస్తామని చెబుతూ వస్తున్న సర్కార్, ఇదే అంశంపై అసెంబ్లీలో చర్చించే అవకాశం ఉంది. ఇప్పుడున్న ఆర్ఓఆర్ చట్టం సమర్థత కలిగినది కాదని అభిప్రాయపడుతున్న ప్రభుత్వం.. దానిని పూర్తి స్థాయిలో సవరించి భూచట్టాలన్నింటినీ ఒకే గొడుగు కింద వచ్చేలా ఒకటే చట్టాన్ని అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది.

# తెలంగాణలో హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు చేస్తాం: సీఎం రేవంత్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సుమారు వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు చేసి అన్ని రకాల వైద్య సేవలు అందేలా అభివృద్ధి చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రపంచ దేశాల నుంచి ఎవరైనా హైదరాబాద్‌కు వస్తే అన్నీ రకాల వైద్య సేవలు అందేలా దాన్ని తీర్చిదిద్దుతామని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఇందులో బసవతారకం ఆస్పత్రికి కచ్చితంగా చోటు ఉంటుందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి 24వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే, బసవతారకం ఆస్పత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ, ఎంపీ నామా నాగేశ్వరరావు, ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..” ఎన్టీఆర్ ఆలోచనతో ఏర్పడ్డ బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి 24ఏళ్లుగా కోట్లాది మందికి సేవలందించడం సంతోషకరం. పేదలకు సేవలందించే ఉద్దేశంతో ఆనాడు ఎన్టీఆర్ ఆస్పత్రి నిర్మాణానికి పూనుకున్నారు. ఆయన ఆలోచనా విధానాలు కొనసాగించాలని ప్రస్తుత ఏపీ సీఎం చంద్రబాబు అప్పట్లో దీని నిర్మాణం పూర్తి చేసి పేదలకు సేవలు అందించేలా తీర్చిదిద్దారు. వైద్య సేవలు అందుతున్న తీరు చూసి ఎన్టీఆర్ స్వర్గం నుంచి మనల్ని ఆశీర్వదిస్తారు. ఆస్పత్రికి సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది. నందమూరి బాలకృష్ణ ఆస్పత్రి 25వ వార్షికోత్సవానికి రావాలని కోరుతున్నారు.

30వ వార్షికోత్సవానికి కూడా నేనే ముఖ్యమంత్రి హోదాలో వస్తా. ఆస్పత్రి లీజ్ వివాదాన్ని క్యాబినేట్ నిర్ణయం తీసుకుని పరిష్కరించాం” అని అన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో ప్రపంచానికి తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. గతంలో 12గంటలు పని చేస్తే చాలు అనుకునే వాడినని కానీ పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి 18గంటలు పని చేసే వ్యక్తి అన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో పోటీ పడి పని చేసే అవకాశం వచ్చిందని.. ఒక ఆటగాడి నైపుణ్యం తెలియాలంటే మరొక మంచి ఆటగాడితో పోటీ పడాలని అన్నారు. చంద్రబాబు ఏపీలో ముఖ్యమంత్రి కావడంతో తనతో సహా అధికారులంతా 18గంటలు పని చేయాల్సిన అవసరం ఏర్పడిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.




**సీఎం రేవంత్‌రెడ్డి అందరికీ ఆదర్శం: నందమూరి బాలకృష్ణ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందరికీ ఆదర్శమని హిందూపురం ఎమ్మెల్యే, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ అన్నారు. బసవతారకం ఆసుపత్రి సేవల విస్తరణకు సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కొరిన వెంటనే ఆయన అంగీకరించారని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి 24వ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆసుపత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ, ఎంపీ నామా నాగేశ్వరరావు, ప్రముఖ క్యాన్సర్ వైద్యులు నోరి దత్తాత్రేయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. క్యాన్సర్ మహమ్మారి ప్రజలను పట్టి పీడిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, మాజీ సీఎం ఎన్.టి.రామారావు దూరదృష్టి కలిగిన వ్యక్తి అని... ఆయన మంచి ఆలోచనతో ఈ ఆసుపత్రిని నిర్మించారని గుర్తు చేశారు. గతంలో బండలతో నిండిన ఈ స్థలంలో బసవతారక ఆసుపత్రి నిర్మించారని.. రోగులకు మంచి సేవలు అందుతున్నాయన్నారు. భారత ప్రధానిగా అటల్ బిహారి వాజ్‌పేయ్ రూ. 6 కోట్లు మంజూరు చేసి ఈ ఆసుపత్రి బలోపేతానికి దోహద పడ్డారని నందమూరి బాలకృష్ణ వివరించారు. ఇంత గొప్ప ఆసుపత్రికి ఛైర్మన్‌గా పని చేయడం తన పూర్వజన్మ సుకృతమని తెలిపారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యేగా హిందూపురం ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేసి కార్పొరేట్ తరహా వైద్యాన్ని ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో సైతం బసవతారకం ఆసుపత్రి ప్రారంభించనున్నామన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి గతంలోనే సీఎం చంద్రబాబు స్థలం కేటాయించిన విషయాన్ని ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ గుర్తు చేశారు.

## తొలిసారి ఎన్నికల బరిలో ప్రియాంక.. ప్రచారానికి దీదీ..!

తిరువనంతపురం: రానున్న లోక్‌సభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ వయనాడ్ నుంచి రాజకీయ అరంగేట్రం చేయనున్నారని ఇటీవల కాంగ్రెస్ ప్రకటించింది. ఇందులోభాగంగా ప్రియాంకకు మద్దతుగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వయనాడ్‌లో ప్రచారం చేసే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తుండడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ, వయనాడ్‌లలో పోటీ చేసి రెండు స్థానాల్లోను భారీ మెజారిటీతో గెలుపొందారు. రెండు స్థానాల్లో గెలిచినవారు ఒక స్థానాన్ని వదులుకోవాలనే నియమం



ప్రకారం ఆయన వయనాడ్ స్థానాన్ని వదులుకున్నారు. దీంతో ఈ స్థానంలో ప్రియాంక పోటీకి దిగుతున్నారు. 2019 నుంచి రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న ప్రియాంక ఇప్పటివరకు ఏ స్థానంలోనూ పోటీ చేయలేదు. కాంగ్రెస్‌పై అభిమానం చూపుతున్న వయనాడ్‌లో ఆమె తొలిసారి పోటీ చేస్తే కచ్చితంగా విజయం సాధిస్తారని హస్తం పార్టీ ధీమా వ్యక్తంచేస్తోంది. లోక్‌సభ ఎన్నికల సమయంలో పశ్చిమబెంగాల్‌లో సీట్ల పంపకంపై విభేదాల కారణంగా మమతా బెనర్జీ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగానే పోటీలోకి దిగారు. అయితే, ఈ రెండు పార్టీలు జాతీయస్థాయిలో ఇండియా కూటమిలో భాగంగా కలిసి పనిచేశాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం మమత మాట్లాడుతూ ఇండియా కూటమికి తృణమూల్ కాంగ్రెస్ బయటినుంచే మద్దతిస్తుందని పేర్కొన్నారు.




# గురి చూసి గొడుతున్న రేవంత్

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో వచ్చే వారం రోజుల్లో కీలక పరిణామాలు జరగనున్నాయా? పది రోజుల కిందట వచ్చిన ఊహాగానాలు నిజం అవుతున్నాయా..? గుంపుగుంపుగా గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు గుడ్ బై చెప్పనున్నారా? పరిణామాలను బట్టి చూస్తుంటే ఇదే నిజం అనిపిస్తోంది. ఉరుము లేని పిడుగులా శుక్రవారం అసెంబ్లీ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కారు పార్టీని వీడి హస్తం గూటికి చేరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా, స్పీకర్ గా కీలక బాధ్యతల్లో పనిచేసిన పోచారం.. ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు సన్నిహితులు.

అయితే, పనిచేసే నాయకుడిని ప్రోత్సహించాలంటూ సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరిపోయారు.

**ఆ 21 మంది ఎవరు..?** పది రోజుల కిందట బీఆర్ఎస్ కు చెందిన 21 మంది ఎమ్మెల్యేలు అందులో ఎక్కువ శాతం జీహెచ్ఎంసీకి చెందిన వారు కాంగ్రెస్ లో చేరతారనే కథనాలు వచ్చాయి. అయితే, అనూహ్యంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాన్స్ వాడకు చెందిన పోచారం కాంగ్రెస్ గూటికి చేరారు.

కాగా, మరో 7-8 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సైతం కాంగ్రెస్ బాటలో ఉన్నారనే ఫీలర్లు వస్తున్నాయి. వీరిలో ఎవరెవరు ఎక్కడివారు అనేది తెలియకున్నా.. కచ్చితంగా వచ్చే వారంలో కీలక పరిణామాలు జరగడం ఖాయమని తెలుస్తోంది.

**బండారి దారి అటే..** ఓవైపు పోచారం ఇచ్చిన షాక్ నుంచి తేరుకోకముందే.. గ్రేటర్ హైదరాబాద్ లోని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డిని కలిశారు. దీంతో లక్ష్మారెడ్డి కూడా హస్తం గూటిలో చేరుతారనే ప్రచారం జరిగింది. కాంగ్రెస్ కండువా కప్పుకొనే గ్రేటర్ హైదరాబాద్ ఎమ్మెల్యేల్లో ఆయననే ముందుంజలో ఉన్నారనే చర్చ జరుగుతోంది.

ప్రస్తుతానికి దీనిపై లక్ష్మారెడ్డి స్పందన వేరేగా ఉంది. గురువారం జానారెడ్డి జన్మదినం కావడంతో.. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెప్పినట్లు తెలిపారు. గురువారం జన్మదినం అయితే మరుసటి రోజు శుభాకాంక్షలు చెప్పడం ఏమిటో కానీ, లక్ష్మారెడ్డి మాత్రం తాను పార్టీ మారడం లేదని చెబుతున్నారు.

కాగా, కాంగ్రెస్ లో చేరకముందు మాజీ మంత్రి దానం నాగేందర్ సైతం ఇదే విధంగా స్పందించిన సంగతి గమనార్హం.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## నాడు తిట్టి.. నేడు పొగిడి..
## టీడీపీపై బీఆర్ ఎస్ వ్యూహం ఏంటి?

టీడీపీ విషయంలో తెలంగాణ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అనుసరిస్తున్న వైఖరి విస్మయానికి గురి చేస్తోంది. తాము అధికారంలో ఉన్నప్పుడు.. టీడీపీని బూచి గా చూపించారు ఆ పార్టీ కీలక నాయకులు. కానీ.. ఇప్పుడు అదే నోటితో టీడీపీపైనా, ఆ పార్టీ అధినేత ఏపీ సీఎం చంద్రబాబుపైనా.. పొగడ్తలు కురిపిస్తున్నారు. పోనీ.. ఇలా చేస్తున్నవారేమైనా చిన్న నాయకులు అనుకుంటే పొరపాటే.. బీఆర్ఎస్ అగ్రనాయకులు. కేటీఆర్, హరీష్ రావులే.. టీడీపీపై పొగడ్తల జల్లు కురిపిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బొగ్గుగనుల వేలం ప్రారంభించారు. దీనికి సంబంధించి రాజకీయం ముసురుకుంది. సింగరేణి ని కూడా.. వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు. అయితే.. దీనిని బీఆర్ఎస్ నాయకులు తప్పుబడుతున్నారు. ఆ మాత్రం సింగరేణికి వేలం లేకుండా .. గనులు కేటాయించలేరా? అని ప్రశ్నిస్తున్నారు. ఇదే సమయంలో ఏపీలో 16 సీట్లు దక్కించుకున్న టీడీపీని , సీఎం చంద్రబాబును చూసి.. రేవంత్ రెడ్డి నేర్చుకోవాలని.. మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. అక్కడ విశాఖపట్నం స్టీల్ ప్లాంటును ప్రవేటీకరణ కాకుండా.. 16 మంది ఎంపీలను మాత్రమే ఉన్నా.. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి.. ప్రవేటీకరణ కాకుండా ఆపారని.. తెలంగాణలో కాంగ్రెస్‌కు 8 మంది, బీజేపీకి 8 మంది ఎంపీలు ఉన్నా.. సింగరేణిని కాపాడలేక పోతున్నారని.. కేటీఆర్ అన్నారు. ఇక, ఇదే విధంగా హరీష్ రావు కూడా.. విమర్శలు గుప్పించారు. టీడీపీని చూసి నేర్చుకోవాలని ఇద్దరూ చెప్పారు. అయితే.. ఇప్పుడు ఇలా.. టీడీపీని పొగిడిన వారు.. గతంలో ఇదే టీడీపీని విమర్శించారు. టీడీపీ నుంచి వచ్చిన రేవంత్ రెడ్డికి తెలంగాణను పాలించే అర్హత లేదన్నారు. తెలంగాణలో ఏపీ పార్టీల మూలాలు ఉన్న నాయకులు అవసరమా? అని ప్రశ్నించారు. తెలంగాణకు ప్రాంతీయ పార్టీలే శ్రీరామరక్ష అని చెప్పారు. కానీ.. ఇప్పుడు టంగ్ మార్చి.. అదే టీడీపీని కేంద్రంగా చేసుకుని పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. మరి వీరి వ్యాఖ్యలకు రేవంత్ ఏమంటారో చూడాలి. ప్రస్తుతం అయితే.. గతంలో కేటీఆర్, హరీష్‌రావులు చేసిన వ్యాఖ్యలకు.. ఇప్పుడు చేస్తున్న వ్యాఖ్యలకు తేడా ఉండడం గమనార్హం.

# మహిళా శక్తి అమలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





ఆదిలాబాద్ జూన్ 22(ప్రభాత సమాచారం):మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసి లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా పాలనాధికారి రాజర్షి షా అధికారులను ఆదేశించారు..శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో ఏర్పాటు చేసిన అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ ద్వార చేపడుతున్న నిర్మాణ పనులు, మహిళా శక్తి కార్యక్రమాల పై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి లక్ష్యంతో వచ్చే ఐదేళ్ళ లో మహిళలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళా శక్తి ద్వారా 15 రకాల కార్యక్రమాలు చేపడుతున్నదని అన్నారు. అందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టుపనిని వారికే అప్పగించిందని మహిళా శక్తి క్రింద మైక్రో ఎంట్రప్రెన్యూర్స్, కుట్టు కేంద్రాలు, పాడి పశువులు, బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ, పౌల్ట్రీ మథర్ యూనిట్స్, సంచార మత్స్య విక్రయ ఔట్ లెట్లు, మిల్క్ పార్లర్స్, మీసేవ, ఈవెంట్ మేనేజ్మెంట్, మహిళా క్యాంటీన్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్, ఫుడ్ ప్రాసెస్సింగ్ యూనిట్స్, కస్టం హైరింగ్ కేంద్రాలు వంటి 15 రకాల కార్యకలాపాలు చేపట్టుటకు మండలాల వారీగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు ఇట్టి కార్యాచరణ ప్రకారం వివిధ మండలాలలో గల మహిళా సమాఖ్య లోని స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ యూనిట్లు నెలకొల్పడమే లక్ష్యంగా ఇప్పటి నుండే కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేస్తున్న శిక్షణ తరగతులకు ఔత్సాహికులైన క్రియాశీలక మహిళా సంఘాల సభ్యులను ఎంపిక చేయాలని అన్నారు. అనంతరం అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ ద్వార చేపడుతున్న నిర్మాణ పనుల పై ఆరాతీసి ఈ నెల 30వ తేదీ లోగా పూర్తి చేయాలని ఆదేశించారు .నాణ్యతా ప్రమాణాలు పాటించి ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.మండలాల వారిగా పురోగతిని అడిగి తెలుసుకుని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హరితానికి సిద్ధం.. సంరక్షణతోనే ఫలితం




పెద్దపల్లి : జిల్లాలో హరితహారం కింద పెంచడానికి మొక్కలను సిద్ధం చేసే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. ఈ ఏడాది 16.64 లక్షల మొక్కలు పెంచాలని నిర్ణయించారు. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలతో పాటు సింగరేణి, ఎన్టీపీసీ, కేశోరామ్ పరిశ్రమలకు లక్ష్యాలు కేటాయించారు. అయితే ఏటా మొక్కలు నాటడంలో ఉత్సాహం చూపుతుండగా సంరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా లక్షల మొక్కలు ఎండిపోతుండగా రూ.కోట్ల నిధులు దుర్వినియోగమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది నాటిన ప్రతి మొక్కనూ బతికించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. గ్రామీణ, పురపాలికల్లో వేర్వేరు నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వచ్చే నెల మొదటి వారంలో మొక్కలు నాటాలని భావిస్తున్నారు.

**నీడనిచ్చే, పూల మొక్కలకు ప్రాధాన్యం**

జిల్లాలో నాటడానికి మొక్కల కొరత లేకుండా ఊరికో నర్సరీ ఏర్పాటు చేశారు. వాటిలో టేకు, ఈత, వెదురు, మలబార్, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేప, రేల, బాదం, రావి, చింత, తులసి, నిమ్మ, జామ, సీతాఫలం, కర్జూర, మందార, సన్నజాజి, మల్లె తదితర రకాల విత్తనాలతో పాటు ప్రకృతిలో లభించే వాటికి ప్రాధాన్యమిచ్చారు. ప్రతి నర్సరీకి కంచె(ఫెన్సింగ్) ఏర్పాటు చేశారు. వేసవిలో నీటిని సమకూర్చేందుకు బోర్లు లేని చోట్ల ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. గత అనుభవాల దృష్ట్యా విత్తన దశ నుంచే నర్సరీలపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ పెంచారు. తరచూ సమీక్షలు నిర్వహిస్తూ లోపాలను సరిదిద్దడంతో గతంతో పోలిస్తే ఈసారి నర్సరీల్లో మొక్కల ఎదుగుదల కొంత మెరుగ్గా ఉంది.

**గ్రామీణాభివృద్ధి శాఖకే అధిక లక్ష్యం**

జిల్లాలో ఈ ఏడాది 16.64 లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా పెట్టుకోగా ఇందులో ప్రధానంగా గ్రామీణాభివృద్ధి శాఖకు 8 లక్షలు, అటవీ శాఖకు 60 వేలు, రామగుండం నగరపాలకసంస్థకు 80 వేలు, పురపాలక సంఘాల్లో పెద్దపల్లికి 50 వేలు, సుల్తానాబాద్‌కు 30 వేలు, మంథనికి 30 వేలు, సింగరేణి 5 లక్షలు, ఆర్ఎఫ్‌సీఎల్ 10 వేలు, ఎన్టీపీసీ 20 వేలు, కేశోరామ్ 5 వేలు, మిగతా లక్ష్యాన్ని మరో 28 శాఖలకు విధించారు. కూలీలతో గుంతల తవ్వకం పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నాటిన ప్రతి మొక్కకూ ముళ్ల కంచెతో పాటు విధిగా నీటి తడులు అందించేలా ఆయా శాఖలు బాధ్యత తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. హరితహారం కింద వెచ్చిస్తున్న రూ.కోట్ల ప్రజాధనం వృథా కాకుండా దిద్దుబాటు చర్యలు చేపడితే ప్రయోజనం కలుగుతుంది.

**ప్రభుత్వ అనుమతి రాగానే నాటుతాం**

**-శివయ్య, అటవీ శాఖ జిల్లా అధికారి**

జిల్లాలో నర్సరీల్లో పెంచుతున్న మొక్కల ఎదుగుదల బాగానే ఉంది. లక్ష్యాలకు సరిపడా అందుబాటులో ఉన్నాయి. మొక్కలు నాటడంతో సరిపెట్టకుండా సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఆదేశించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే మొక్కలు నాటేలా ప్రణాళిక సిద్ధం చేశాం.

# నిధులిస్తేనే.. సాంకేతిక విద్యాభివృద్ధి

సిరిసిల్ల : జేఎన్‌టీయూలోని విద్యార్థులకు అనుగుణంగా తరగతి గదులు, వసతి గృహాలను సమకూర్చడం ఏటా సవాలుగా మారుతోంది. గతేడాది కళాశాల భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించారు. వాటికి నిధుల కేటాయింపులో జాప్యం కారణంగా పనులు ముందుకు సాగడంలేదు. జిల్లాకు 2021-22 విద్యాసంవత్సరంలో జేఎన్‌టీయూ కళాశాల మంజూరైంది. తాత్కాలికంగా అగ్రహారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలోని కొంత భాగంలో ఇంజినీరింగ్ తరగతులు జరుగుతున్నాయి. సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్, టెక్స్‌టైల్ విభాగాల్లో మూడేళ్లలో కలిపి 780 మంది విద్యార్థులున్నారు. వీరిలో 600 మంది వసతి గృహాల్లో ఉంటున్నారు. ఈ ఏడాది ప్రవేశాలకు ఈసెట్ వెబ్ ఆప్షన్లు గురువారం నుంచి మొదలవుతాయి. ఎంసెట్ ర్యాంకుల వారీగా ఈ నెలాఖరులో వెబ్ ఆప్షన్లు ఇచ్చే అవకాశం ఉంది. దాని తర్వాత కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. నాలుగో సంవత్సరం విద్యార్థులకు అదనపు తరగతి గదులతోపాటు కొత్తగా చేరేవారికి వసతి గృహాలకు ఇప్పటి నుంచే అన్వేషణ ప్రారంభించారు.

**బోధన.. భోజనం అక్కడే**

కొత్త విద్యాసంవత్సరంలోకి అడుగు పెట్టేసరికి ప్రస్తుతం ఉన్న తరగతి గదులు సరిపోవడంలేదు. మౌలిక వసతుల కల్పనలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. నాలుగేళ్లుగా విశ్వవిద్యాలయం గ్రాంట్ నుంచి విడతల వారీగా డిగ్రీ కళాశాలలోనే అదనపు గదులు, కంప్యూటర్ ల్యాబ్, వంటగది, భోజనశాలకు ఫ్యాబ్రికెట్ షెడ్‌లను ఏర్పాటు చేసుకున్నారు. అగ్రహారం, చిర్లవంచ ఆర్అండ్ఆర్ కాలనీలోని ఎనిమిది ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకుని బాల, బాలికలకు వేర్వేరు వసతి గృహాలను సమకూర్చారు. ఈ ఏడాది అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయితే మరో 150 ప్రవేశాలకు అవకాశం ఉంది. అదనంగా నాలుగు తరగతి గదులు అవసరం. మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, కంప్యూటర్ విభాగాలకు ల్యాబ్స్ కోసం కొండగట్టు జేఎన్‌టీయూకి పంపుతున్నారు. మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన 14 మంది టెక్స్‌టైల్ విద్యార్థులు ఉస్మానియా ఇంజినీరింగ్ కళాశాలలో తరగతులు ఇప్పిస్తున్నారు. నాలుగో సంవత్సరం కూడా అక్కడే తరగతులు నిర్వహించేలా ప్రణాళికలు చేస్తున్నారు.

**పనుల ప్రారంభానికి జాప్యం**

తంగళ్లపల్లి మండలం మండేపల్లిలో జేఎన్‌టీయూ కళాశాల భవన నిర్మాణానికి 20 ఎకరాల స్థలాన్ని గతేడాది ఆగస్టులో రెవెన్యూ శాఖ రిజిస్ట్రార్‌కు అందించింది. అంతకుముందు జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ నిర్మాణ విభాగం అధికారులు, రెవెన్యూ శాఖ సంయుక్తంగా సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. కళాశాల నిర్మాణానికి తొలుత సిరిసిల్ల-కామారెడ్డి బాహ్యవలయ రహదారి సమీపంలోని పెద్దూరు వద్ద 50 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. కేటాయింపులు జరిగేలోపు ఆ స్థలాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించారు. చివరికి మండేపల్లిలోని స్థలాన్ని ఖరారు చేసి ఇచ్చారు.

**నివేదికలు అందజేశాం- వేణుగోపాల్, ప్రిన్సిపల్,** జేఎన్‌టీయూ సిరిసిల్ల విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా మౌలిక వసతులు సమకూర్చడం, కళాశాలలో నెలకొన్న పరిస్థితులపై ఇటీవలే జేఎన్‌టీయూ ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశాం. తాత్కాలిక అవసరాలకు సైతం నిధులు అవసరం ఉంది. ప్రవేశాల ప్రక్రియ పూర్తయ్యేలోపు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు సమకూర్చుతాం.

## కుచలాపూర్‌లో చిరుతపులి సంచారం



**ఆదిలాబాద్ జూన్ 22(ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కుచలాపూర్‌లో చిరుతపులి సంచారం కలకలం రేపింది. అటవీశాఖ బిగించిన సీసీ కెమెరాల్లో చిరుత పులి దృశ్యాలు నమోదయ్యాయి. తలమడుగు పరిసర గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే చిరుత దాడిచేసి ఓ పశువుతో పాటుగా, రెండు మేకలను చంపింది.చిరుత దాడుల నేపథ్యంలో గ్రామస్థుల్లో భయాందోళనలు ఎక్కువయ్యాయి. రైతులు, కూలీలు పంటచేలకు వెళ్లేందుకు జంకుతున్నారు. మరోవైపు అటవీ అధికారులు చిరుతకు ఎలాంటి హాని తలపెట్ట వద్దని కోరుతున్నారు. చిరుత ఎదురు పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. చిరుత సంచారంతో వ్యవసాయ పనులు చేసుకోలేక పోతున్నామని, అధికారులు తమకు రక్షణ కల్పించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అంగరంగ వైభవంగా శివ పార్వతుల కల్యాణం



**వీణవంక జూన్ 22 ( ప్రభాత సమాచారం)**

వీణవంక మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శివ పార్వతుల కళ్యాణం ఆలయంలో ఘనంగా అంగరంగ వైభవంగా జరిగింది.ఆలయ వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శివ పార్వతులను పట్టు వస్త్రాలతో సర్వా సుందరంగా అలంకరించి మేళతాళాల మధ్య అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కూచనపల్లి మల్లయ్య. కూచనపల్లి సారయ్య. కూచనపల్లి కుమారస్వామితోపాటు భక్తులు గ్రామస్తులు సంఖ్యలో పాల్గొన్నారు

# ముందు ఉదాసీనం.. తర్వాత క్రియాశీలం

ఆసిఫాబాద్: రెండేళ్ల కిందట ఈ ప్రాంతమంతా అడవే. ప్రస్తుతం పూర్తిగా పంట చేలుగా మారింది. లింగాపూర్, తిర్యాణి మండలాల్లో ఈ విధంగా యథేచ్ఛగా అడవుల నరికివేత, పోడు సాగు భారీగా సాగుతోంది. పచ్చని వన సంపద మైదానంలా మారుతోంది. రెండు, మూడు సంవత్సరాల క్రితం ఉన్న దట్టమైన అడవులు పంట పొలాలుగా మారుతున్నాయి. నరికే సమయంలో ఉదాసీనంగా ఉన్న అటవీ అధికారులు సాగు చేసుకునే సమయంలో ఉరుములేని పిడుగులా విరుచుకుపడి పంట భూములను స్వాధీనం చేసుకుంటామని హడావుడి చేయడం జిల్లాలో పరిపాటిగా మారింది. పోడు సాగు చేసుకునే రైతుల భూముల నుంచి తప్పకుండా కొంత భాగం తీసుకోవాలని ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో.. వీరంతా తలలు పట్టుకుంటున్నారు. విత్తనాలు వేస్తున్న రైతుల వద్దకు వెళ్లి భూమి తిరిగి ఇవ్వాలని కోరడంతో.. జిల్లా వ్యాప్తంగా ఏదో చోట ఆందోళనలు జరుగుతున్నాయి.

జిల్లాలోని లక్ష ఎకరాల్లో పోడు సాగుతుందని అంచనా. మొదట గిరిజనులు సాగు చేసినా, వివిధ కారణాలతో వారి భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. అనంతరం వీరు అడవిని నాశనం చేస్తూ పోడును విస్తరిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఆదివాసీలనే ముందుంచి వనాన్ని నరికేసి బడా బాబులు సాగుకు ఉపక్రమిస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు కాసుల యావతో ఇబ్బడిముబ్బడిగా పట్టాలు అందించారు. దీంతో పట్టాలున్న భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి. అటవీ, రెవెన్యూ సరిహద్దు వివాదాలు కొలిక్కిరాక పోవడం, అటవీ భూములకు పట్టాలు జారీ కావడంతో ఏటా ఈ వ్యవహారం జఠిలంగా మారుతోంది. జిల్లాలో 11 రేంజ్‌లు ఉండగా, ఒక్కో దాని నుంచి 150 ఎకరాల చొప్పున మొత్తం 12,650 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని డీఎఫ్ఓ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**అందరికీ పట్టాలు...**

కాగజ్‌నగర్ మండలంలోని అంకుసాపూర్ సర్వే నం.145లో 600 ఎకరాల భూమి ఉంది. రైతులకు 199 ఎకరాల్లో మాత్రమే రెవెన్యూ భూమి ఉందని అటవీ అధికారులు చెబుతున్నారు. దాదాపు నాలుగు వందల ఎకరాల అటవీ భూమి పూర్తిగా పొలాలుగా ఉన్నాయి. వీటికి పట్టాలున్నాయి. ఈ ప్రాంతంలో పులి కదలికలు ఉన్నాయి. ఇటీవల అధికారులు భూమిని తీసుకుందామని వెళ్లేసరికి రైతులతో వాగ్వాదం జరిగింది. పట్టా పాస్ పుస్తకాలతో రైతులు ఆందోళనకు దిగారు.

**అన్ని మండలాల్లోనూ...**

ఇటిక్యాలపహాడ్ మాదిరిగానే ఆసిఫాబాద్ మండలం దానాపూర్‌లో సైతం రైతులతో అటవీ అధికారులకు నిత్యం వాగ్వాదం జరుగుతోంది. భూములన్నింటినీ తిరిగి ఇచ్చేయాలని అధికారులు చెప్పడంతో.. గ్రామస్థులు ఆందోళన చేస్తున్నారు. పెంచికల్‌పేట్, బెజ్జూర్, చింతల మానేపల్లి, రెబ్బెన మండలాల్లోని పలు ప్రాంతాల్లో ఇదే సమస్య ఉంది.

**ఇరువైపులా వాదనలు..** మహారాష్ట్రలోని తడోబా అభయారణ్యాల నుంచి పులులు ఎక్కువగా సిర్పూర్(టి) మండలం ఇటిక్యాలపహాడ్ గ్రామం నుంచి కాగజ్‌నగర్ అడవుల్లోకి ప్రవేశిస్తాయి. ఇక్కడి రైతులు దాదాపు 800 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మొదట 550 ఎకరాల వరకు భూములను తీసుకుంటామని చెప్పిన అధికారులు ప్రస్తుతం మొత్తం ఇవ్వాలని పట్టుపడుతున్నారు. ఈ విషయమై అధికారులు నిత్యం గ్రామస్థులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. భూములు ఇస్తే జీవనాధారం కోల్పోతామని వాపోతున్నారు. కుమురం భీం ప్రాజెక్టు పునరావాసంలో భాగంగా ఇక్కడ గ్రామస్థులకు పునరావాసం కల్పించామని, అక్కడే భూములు కోల్పోయిన వారికి పరిహారం అందజేశామని, ఈ రైతులం తా గిరిజనేతరులే అని అటవీ భూములపై వీరికి హక్కులు కల్పించలే మని అధికారులు పేర్కొంటున్నారు.

**ప్లాంటేషన్ కోసం తీసుకుంటున్నాం నీరజ్‌కుమార్, డీఎఫ్ఓ**

రెవెన్యూ భూముల పట్టాలు కలిగి ఉండి, అదనంగా పోడు సాగు చేసుకుంటున్న వారి భూములను తీసుకోవాలని పై నుంచి ఆదేశాలున్నాయి. ఒకచోట పరిహారం తీసుకుని భూములు కోల్పోయిన వారు మరోచోట ఇష్టానుసారంగా చెట్లను నరికేస్తూ పోడు చేసుకుంటున్నారు. ఇటువంటి వాటినే స్వాధీనం చేసుకుని మొక్కలు నాటుతాం.




హైదరాబాద్: బురఖా వేసుకుని ఒకడు.. హెల్మెట్‌తో మరొకడు వచ్చి ఓ బంగారు ఆభరణాల దుకాణ యజమానిని కత్తితో పొడిచి పట్టపగలే దోపిడీకి యత్నించిన ఘటన మేడ్చల్‌లో కలకలం సృష్టించింది. ఈ కేసులో నిందితులను 24గంటల్లోనే అరెస్టు చేసినట్టు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి వెల్లడించారు. "ఈ నెల 20న మేడ్చల్ లోని శ్రీ జగదాంబ జువెలర్స్ దుకాణంలోకి బురఖా వేసుకుని ఒకరు, హెల్మెట్ ధరించి మరో దుండగుడు వచ్చారు. నగలు, నగదు చోరీ చేశారు. 40 సెకన్లలోనే దోపిడీ పూర్తి చేశారు. నిందితులు పారిపోయిన నేపథ్యంలో 200 సీసీ కెమెరాలు పరిశీలించాం. కిలో మీటరు దూరంలో బైక్ వదిలిపెట్టి వారు పరారయ్యారు.

ఓయూ, హబ్సిగూడలో బైక్‌లు దొంగలించారు. నిందితుల ను పట్టుకునేందుకు 16 బృందాలను ఏర్పాటు చేసి గాలించాం. ఇటీవల చాదర్‌ఘాట్‌లో జరిగిన చోరీ కేసులో కూడా వీళ్ల ప్రమేయం ఉన్నట్లు గుర్తించాము. నజీం, సోహైల్‌ను అరెస్ట్ చేశాం. చోరీ నిమిత్తం వీరు మూడు సార్లు రెక్కీ నిర్వహించారు. బంగారం షాప్‌ను లక్ష్యంగా చేసుకొని దోపిడీకి పాల్పడ్డారు" అని సీపీ వివరించారు.

# ఏపీ, తెలంగాణలోని వ్యాపారవేత్తలకు డ్రగ్స్ సరఫరా.. పోలీసుల అదుపులో నిందితుడు



హైదరాబాద్: మాదాపూర్‌లో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టు బడింది. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కి డ్రగ్స్ తీసుకొస్తున్న సాయిచరణ్‌ని టీజీ న్యాబ్, మాదాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్‌ని చిన్న చిన్న ప్యాకెట్లలో పెట్టి.. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కి వచ్చే ట్రావెల్స్ డ్రైవర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న వ్యాపారవేత్తలు మాలిక్ లోకేశ్, సందీప్‌రెడ్డి, రాహుల్, సుబ్రహ్మణ్యంలతో పాటు సాయిచరణ్‌ను నార్కోటిక్ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. సాయి చరణ్ నుంచి పెద్ద మొత్తంలో ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు.

గతంలోనూ డ్రగ్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు సాయిచరణ్‌ను పట్టుకున్నారు. నిందితుడు హైదరాబాద్, నెల్లూరు, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖలోని దాదాపు 50 మంది వ్యాపారవేత్తలకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్టు దర్యాప్తులో తేలింది.




# తెలంగాణ బీజేపీలో రాజాసింగ్ వ్యాఖ్యల కలకలం..

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి.. ఆ పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షులు కిషన్‌రెడ్డిని కేంద్రమంత్రివర్గంలో తీసుకోవడంతో తెలంగాణకు కొత్త అధ్యక్షుడిని నియమిస్తారంటూ ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలో ఇటీవల ఆ పార్టీ నుంచి గెలిచిన 8మంది ఎంపీల్లో ఇద్దరిని కేంద్ర కేబినెట్‌లోకి తీసుకున్నారు. మిగిలిన ఆరుగురు ఎంపీల్లో నలుగురు పేర్లు రాష్ట్ర అధ్యక్షుడి పదవి రేసులో వినిపిస్తున్నాయి. మెదక్ ఎంపీ రఘునందన్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షుడి రేసులో ఉన్నారు. కేంద్రమంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో ఈటలకు బీజేపీ తెలంగాణ శాఖ బాధ్యతలు అప్పగిస్తారంటూ గత కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. పార్టీ అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ సంస్థాగత మార్పుల్లో భాగంగా కొత్త జాతీయ అధ్యక్షుడితో పాటు వివిధ రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తారని.. దీనిలో భాగంగా తెలంగాణకు కొత్త అధ్యక్షుడిని నియమించే అవకాశాలు ఉన్నాయి. అధ్యక్షుడి పోస్టు కోసం చాలామంది ప్రయత్నిస్తున్నప్పటికీ.. సామాజిక సమీకరణలు, తెలంగాణలో పార్టీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అధ్యక్షుడిని నియమించాలని బీజేపీ అగ్రనాయకత్వం భావిస్తోంది. ఈక్రమంలో బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలు ఆ పార్టీలో కలకలం రేపుతున్నాయి. కొత్త అధ్యక్షుడి నియామకంపై రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతమనే చర్చ జరుగుతోంది.

**రాజాసింగ్ ఏమన్నారంటే..** బీజేపీ తెలంగాణ శాఖ కొత్త అధ్యక్షుడిగా దేశం, ధర్మం పట్ల అవగాహన ఉన్న వ్యక్తిని నియమించాలని రాజాసింగ్ కోరారు. పార్టీలో అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత అధ్యక్షుడి ఎంపిక జరగాలని.. 8 మంది ఎంపీలు, ఎమ్మెల్యేల అభిప్రాయం తీసుకోవాలని రాజాసింగ్ ఓ వీడియో విడుదల చేశారు. తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ పెరుగుతోందని.. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఓ వైపు ఈటలను అధ్యక్షుడిగా నియమిస్తారంటూ ప్రచారం జరుగుతున్న వేళ రాజాసింగ్ వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. సుదీర్ఘకాలం బీఆర్ఎస్‌లో ఉన్న ఈటల రాజేందర్ 2021లో బీజేపీలో చేరారు. వామపక్ష భావజాలం కలిగిన ఈటల తన రాజకీయ భవిష్యత్తు నేపథ్యంలో బీఆర్ఎస్‌ను వీడిన తర్వాత బీజేపీలో చేరారు. దేశం, ధర్మం పట్ల అవగాహన ఉన్న వ్యక్తిని నియమించాలని రాజాసింగ్ డిమాండ్ చేస్తుండటంతో.. ఆయన పరోక్షంగా ఈటల అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారనే చర్చ జరుగుతోంది.

**రాజాసింగ్ వ్యాఖ్యల వెనుక..** ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీలుగా గెలిచిన వ్యక్తుల్లో ఒకరికి అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలనుకుంటే ధర్మపురి అర్వింద్‌కు ఇవ్వాలని రాజాసింగ్ కోరుతున్నట్లు ఆయన వ్యాఖ్యల ఆధారంగా తెలుస్తోంది. అర్వింద్ 2019 ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. మరోవైపు హిందుత్వ భావజాలం కలిగిన అర్వింద్‌కు రాజాసింగ్ మద్దతు ఇస్తున్నట్లు తెలుస్తోంది. రాజాసింగ్ వ్యాఖ్యల నేపథ్యంలో బీజేపీ అధినాయకత్వం తెలంగాణ శాఖ కొత్త అధ్యక్షుడి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది వేచిచూడాల్సి ఉంది.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194




హైదరాబాద్: బసవతారకం ఆసుపత్రి లక్షలాది మందికి సేవలందిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆసుపత్రి వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిస్వార్థంగా పేదలకు సేవలందించేందుకు ఆసుపత్రిని నిర్మించారని చెప్పారు. "ఏపీ సీఎం చంద్రబాబుతో అభివృద్ధిలో పోటీపడే అవకాశం నాకు వచ్చింది. ఆయన 18 గంటలు పనిచేసి.. నేను 12 గంటలు పని చేస్తే సరిపోదు. తెలంగాణ రాష్ట్ర నేతలు, అధికారులు కూడా 18 గంటలు పని చేయాల్సిందే. అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలు పోటీ పడాలి.. ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి. హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు చేయాలని చూస్తున్నాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు. క్యాన్సర్ మహమ్మారి ప్రజలను పట్టి పీడిస్తోందని బసవతారకం ఆసుపత్రి ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆసుపత్రి సేవల విస్తరణ కోసం సీఎం రేవంత్‌రెడ్డి సహకారం కోరగానే అంగీకరించారని చెప్పారు. దాతల సహకారంతో ఆసుపత్రి ఈ స్థాయికి చేరుకుందని తెలిపారు. సేవలను మరింత విస్తరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, డా.నోరి దత్తాత్రేయుడు పాల్గొన్నారు.



# నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలం

హైదరాబాద్: గ్రూప్స్ అభ్యర్థుల, నిరుద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు శనివారం బహిరంగ లేఖ రాశారు. గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగులకు క్యాబినెట్ సమావేశంలో న్యాయం చేసేలా నిర్ణయాలు తీసుకుంటుంటారని ఎదురుచూశామని అన్నారు. గ్రూప్ అభ్యర్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, సమస్యల గురించి ఎలాంటి చర్చ లేకుండా క్యాబినెట్ సమావేశం ముగించారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి మరిచారని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు నెలకు రూ.4,000 భృతి ఇస్తామని మాట ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇప్పటికే ఆరు నెలలు దాటిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన ఉద్యోగాలకు రేవంత్ రెడ్డి నియామక పత్రాలను ఇచ్చారు తప్ప కొత్తగా ఒక్క ఉద్యోగం కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మిమ్మల్ని నమ్మి అధికారంలోకి తీసుకొచ్చిన నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం రోడ్డున పడి అర్తనాదాలు చేయాల్సిన పరిస్థితికి తెచ్చారని చెప్పారు. గ్రూప్ 1, డిఎస్సీ తదితర ఉద్యోగాల కోసం చేపట్టిన నియామక ప్రక్రియ కూడా ఉద్యోగార్థులకు చాలా ఇబ్బంది కరంగా మారిందన్నారు. కనీసం వారు చేస్తున్న విజ్ఞప్తిని వినే పరిస్థితిలో కూడా ప్రభుత్వం లేకపోవడం శోచనీయమన్నారు. మెయిన్స్‌కు 1 : 50 నిష్పత్తిలో కాకుండా, 1 : 100 నిష్పత్తిలో అభ్యర్థులను అనుమతించాలని కోరారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన గ్రూప్ 2 నోటిఫికేషన్‌లో 1:15 గా పేర్కొన్నప్పటికీ, అభ్యర్థుల కోరిక మేరకు 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కి ఎంపిక చేశారని గుర్తుచేశారు. గ్రూప్ 2కు రెండు వేల ఉద్యోగాలు, గ్రూప్ 3కి మూడు వేల ఉద్యోగాలు అదనంగా కలుపుతామని రేవంత్ మాట ఇచ్చారని.. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోటీ పరీక్షల మధ్య కాలవ్యవధి చాలా తక్కువ ఉండడం వల్ల అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఉద్యోగ నియామకాల పరీక్షల తేదీల మధ్య ఎక్కువ వ్యవధి ఉండేలా షెడ్యూల్ సవరించాలని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు.

# సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణలో భాజపాకు కాంగ్రెస్ సహకారం: కేటీఆర్



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు చూసి తన సమాధిలో గోబెల్స్ ఉలిక్కిపడ్డారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టేందుకు కాంగ్రెస్, భాజపా యత్నిస్తోందని ఆరోపించారు. తెలంగాణలో బొగ్గు బ్లాకుల అమ్మకాలను భారాస వ్యతిరేకించిందన్నారు. "మీ ప్రభుత్వంలో మాదిరిగా మా ప్రభుత్వం నుంచి ఎవరూ వేలంలో పాల్గొనలేదు. చివరి రౌండ్‌లో 2 బ్లాకులను కేంద్రం ఏకపక్షంగా వేలం వేసింది. తెలంగాణ ఆస్తులు, హక్కులు, వనరులు తాకట్టు పెట్టే యత్నం చేస్తున్నారు. ఆస్తులు తాకట్టు పెట్టే నేరాల్లో కాంగ్రెస్, భాజపా భాగస్వాములు. రాష్ట్ర నదీ ప్రాంత హక్కుల రక్షణలో కాంగ్రెస్ విఫలమైంది. సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణలో భాజపాకు కాంగ్రెస్ సహకారం అందించింది. అన్ని రంగాలకు ద్రోహం చేస్తున్న పార్టీలకు ప్రజలు గుణపాఠం చెబుతారు" అని కేటీఆర్ విమర్శించారు.

# ఈశ్వరమ్మను పరామర్శించిన మంత్రి జూపల్లి.. తక్షణ సాయంగా రూ.2 లక్షలు



కొల్లాపూర్: కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లిలో దాడికి గురైన చెంచు మహిళ ఈశ్వరమ్మను మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలో చికిత్స పొందుతున్న ఆమెను పరామర్శించిన మంత్రి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఆమెకు అండగా ఉంటుందని చెప్పారు. తక్షణ సహాయంగా రూ. 2 లక్షలు, ప్రభుత్వం తరపున కొంత భూమి ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈశ్వరమ్మ పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పిస్తామని తెలిపారు. ఆమెను శారీరకంగా, మానసికంగా హింసించిన వారికి చట్టపరంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏం జరిగిందంటే.. ఈశ్వరమ్మ, భర్త ఈదన్న తమ వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చారు. ఆ భూమిలో వెంకటేశ్ ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రం పెట్టుకోగ తన దగ్గరే ఈదన్న, బాధితురాలు ఈశ్వరమ్మ పని చేసేవారు. ఒక రోజు భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో ఈశ్వరమ్మ తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ఈశ్వరమ్మ పనికి రావట్లేదని యజమాని వెంకటేష్.. ఈశ్వరమ్మను పుట్టింటి నుండి తీసుకొచ్చి తన దగ్గరే గదిలో బంధించి పాశవికంగా దాడి చేశాడు. ఈశ్వరమ్మను మర్మంగాలపై కారం చల్లి, డీజిల్ పోసి నిప్పంటించి, కర్రలతో తీవ్రంగా కొట్టడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఈశ్వరమ్మను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# సైబరాబాద్‌లో 27మంది ఎస్ఐల బదిలీ..

హైదరాబాద్: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 27 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. ఆర్‌జీఐ ఎయిర్‌పోర్ట్ ఎస్ఐ జి.మనియామ్ కేపీహెచ్‌బీకి, కేపీహెచ్‌బీ ఎస్ఐ కె.సత్యనారాయణ మైలార్‌దేవుపల్లికి, అత్తాపూర్ ఎస్ఐ కె.నాగరాజు రాయదుర్గం ట్రాఫిక్‌కు, బాలానగర్ ఎస్ఐ అశోక్ లిగెపల్లి అత్తాపూర్‌కు, రాజేంద్రనగర్ ఎస్ఐ పి.రవికిరణ్ ఎస్‌వోటీ బాలానగర్ జోన్‌కు, ఆర్‌జీఐఏ ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న టి.వెంకటేశ్వరావును మాదాపూర్ ట్రాఫిక్‌కు, సీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న ఆర్.మౌనికను పేట్‌బషీరాబాద్ పీఎస్‌కు, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ ఎస్ఐ జి.శశిధర్‌ను ఐటీసెల్ సీపీఏ సైబరాబాద్‌కు, ఐటీ సెట్ సైబరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న సయ్యద్ నజీర్ మియాన్‌ను కేపీహెచ్‌బీకి బదిలీ అయ్యారు. అలాగే ఐటీసెల్ సైబరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న ఈ.రూపను కేపీహెచ్‌బీకి, గచ్చిబౌలి ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న ఎ.కృష్ణను మైలార్‌దేవ్‌పల్లికి, చెవెళ్ల నుంచి ఆర్. వీరబ్రహ్మమ్‌ను గచ్చిబౌలి ట్రాఫిక్‌కు, మైలార్‌దేవ్‌పల్లి ఎస్ఐ నయీమ్ హుస్సేన్‌ను కేపీహెచ్‌బీ ట్రాఫిక్‌కు, సీసీఆర్‌బీకి చెందిన కె.రాజేశ్వర్ రెడ్డి మియాపూర్‌కు, మియాపూర్ ఎస్ఐ ఎం.రాజు సీసీఎస్ బాలానగర్ జోన్, పేట్‌బషీరాబాద్ ఎస్ఐ జి.సరిత కేపీహెచ్‌బి ట్రాఫిక్‌కు, సీసీఎస్ బాలానగర్ ఎస్ఐ దాసరి బాల్‌రాజ్ ఎస్‌వోటీ మాదాపూర్ జోన్, ఎస్ఓటీ మాదాపూర్ జోన్ ఎస్ఐ బి.నర్సింహారెడ్డి మియాపూర్‌కు, ఎస్ఓటీ బాలానగర్ జోన్ ఎస్ఐ మామిడి కిషోర్ రాజేంద్రనగర్‌కు, రాయ్‌దుర్గం ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న మలావత్ పరుషురామ్‌ను శామీర్‌పేట్ పీఎసకు బదిలీ చేశారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660